సాక్షి
గుంటూరు

గురువారం : 26 : జూన్ : 2025



భక్తిశ్రద్ధలతో చండీ హోమం

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులో ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో బుధవారం అమావాస్య సందర్భంగా చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



ఆంజనేయునికి విశేష పూజలు

మాచర్ల: గుంటూరు రోడ్డులోని సప్తగిరి కాలనీ విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం విశేష పూజలు జరిగాయి.



అసంపూర్తిగా రోడ్డు పనులు

క్రోసూరు: అమరావతి – బెల్లంకొండ రోడ్డు నిర్మాణంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు. రోడ్డు మొత్తం గోతులమయంగా మారిందని వాపోతున్నారు.

గ్రానైట్.. రైట్..రైట్!



దాచేపల్లిలో అధికారులు సీజ్ చేసిన గ్రానైట్ లారీలు



జీరో బిల్లుపై తరలిస్తున్న గ్రానైట్ రాయి

జీరో బిల్లులతో సరిహద్దులు దాటుతున్న సరుకు

- బాపట్ల జిల్లా మార్టూరు నుంచి చిలకలూరిపేట – నరసరావుపేట– తంగెడ మీదుగా తెలంగాణకు అక్రమ తరలింపు
- రోజుకు పదుల సంఖ్యలో తరలుతున్న లారీలు
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం
- గ్రానైట్ అక్రమ వ్యాపారంతో రూ.కోట్లు గడిస్తున్న తెలుగుదేశం నేతలు
- జీరో బిల్లులతో సరిహద్దులు దాటిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- తాజాగా 11 లారీలను పట్టుకున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డు, అదుపులేకుండా పోతోంది. అక్రమాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా మట్టి, ఇసుక, రేషన్ బియ్యం, మద్యం, గ్రానైట్.. ఇలా చెప్పుకొంటూ పోతే బయటపడే అవినీతి కథలు ఎన్నెన్నో.. ఇటీవల గ్రానైట్ అక్రమ తరలింపు వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా అక్రమార్కులు అడ్డదారిలో గ్రానైట్‌ను తరలిస్తూ రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. తాజాగా బాపట్ల జిల్లా మార్టూరు నుంచి హైదరాబాద్ తరలిస్తున్న 11 గ్రానైట్ లారీలను వాణిజ్య పనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ బిల్లులను చెల్లించకుండా జీరో బిల్లుపై ఈ లారీలు తరలిస్తున్నట్టుగా అధికారులు గుర్తించి సీజ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం లోని పలువురు ప్రజాప్రతినిధులు, బడానేతలకు ఈ గ్రానైట్ వ్యవహారంలో వాటాలు ఉన్నట్లుగా చర్చ జరుగుతుంది. అధికారులకు సైతం ముడుపులు అందుతుండటంతో గ్రానైట్ హద్దులు దాటి ఇతర రాష్ట్రాలకు సైతం తరలిపోతోంది.

పదుల సంఖ్యలో పట్టివేత

తాజాగా దాచేపల్లి, పిడుగురాళ్ల, నకరికల్లు మండలాల పరిధిలో 11 గ్రానైట్ లారీలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిరోజు 70 నుంచి 90 గ్రానైట్ లారీలు హైదరాబాద్ తరలిపోతున్నట్లుగా అధికారులు గుర్తించారు. గ్రానైట్ అక్రమ రవాణా వ్యవహారం జోరందుకోవటంతో వాణిజ్య పనులు శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గ్రానైట్ లారీలను పట్టుకునేందుకు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే 11 లారీలను పట్టుకొని అధికారులు సీజ్ చేశారు. ఏడాదిగా కూటమి ప్రభుత్వంలో అధికంగా గ్రానైట్ లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లుగా వాణిజ్య పన్నుల శాఖ అధికారులుచెప్పుకొంటున్నారు.

మా దారి అడ్డదారి

గ్రానైట్ రాయి అక్రమ తరలింపు వ్యవహారంలో అక్రమార్కులు అడ్డదారులను ఎంచుకుంటున్నారు. ఎక్కడికక్కడ తమ మనుషులతో గస్తీ నిర్వహిస్తూ తమ వ్యాపార సామ్రాజ్యాన్ని రోజురోజుకు విస్తరిస్తూ రూ.కోట్లకు పడగ లెత్తుతున్నారు. బాపట్ల జిల్లా మార్టూరులో లభించే గ్రానైట్ రాయిని అక్రమంగా లారీల ద్వారా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మార్టూరులో గ్రానైట్ రాయి లారీ లు బయలుదేరి దగ్గర నుంచి పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల, తంగెడ పరిధిలోని రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు దాటే అంతవరకు అక్రమార్కులు అధికారుల కంట పడకుండా లారీలను సరిహద్దు దాటిస్తున్నారు. మార్టూరు నుంచి చిలకలూరిపేట, అక్కడ నుంచి నరసరావుపేట, నరసరావుపేట నుంచి పిడుగురాళ్ల మీదుగా కారంపూడి వయా గురజాల, మాచవరం, దాచేపల్లి మండలాల మీదుగా తంగెడ, పొందుగల సరిహద్దు చెక్ పోస్ట్ లను దాటిస్తున్నారు. రోజుకు 70 నుంచి 90 లారీల వరకు గ్రానైట్ రాయిని తరలిస్తున్నట్లుగా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

నిద్రావస్థలో అధికారులు

గ్రానైట్ అక్రమ తరలింపు అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవటం తీవ్ర చర్చనీయాంశమైంది. గ్రానైట్ అక్రమ తరలింపును కట్టడి చేయాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారు. మార్టూరు నుంచి బయలుదేరుతున్న గ్రానైట్ లారీలు రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నా.. అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాపట్ల, చిలకలూరిపేట, నరసరావుపేట పరిధిలోని వాణిజ్య పనుల శాఖ, భూగర్భ గనుల శాఖ అధికారులు వీటిపై దృష్టి పెడితే ఈ అక్రమాలకు ఎప్పుడో చెక్ పడేది. అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంతోపాటు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపణ వస్తుండడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మార్టూరు నుంచి వచ్చే ఈ లారీలను అక్కడి అధికారులు ఎందుకు ఆపటం లేదనే దానిపై అనుమానాలు వస్తున్నాయి. కేవలం దాచేపల్లి వద్ద మాత్రమే లారీలు పట్టుబడుతుండడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి గ్రానైట్ అక్రమ తరలింపు వ్యవహారానికి చెక్ పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

న్యూస్‌రీల్

రేపు సీఎం చంద్రబాబు రాక

ఏర్పాట్లను పరిశీలించిన అధికారుల బృందం



ప్రత్తిపాడు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 27న ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలకు రానున్నారు. ఏపీ పోలీస్ శాఖ ఈ నెల 27, 28, 29 తేదీల్లో జాతీయ స్థాయి ఏఐ హ్యాకథాన్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తొలిరోజు ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఆయన పర్యటన ఖరారు కావడంతో బుధవారం కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పాటు పోలీసు ఉన్నతాధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం హ్యాకథాన్ జరిగే కార్యక్రమ వివరాలపై ఐటీ రంగ నిపుణులతో, కళాశాల సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ మధుసూదనరెడ్డి, ఐజీ శ్రీకాంత్, ఎస్పీ పి. సతీష్ కుమార్, సబ్ కలెక్టర్ సంజన సింహా, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాస్, సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి. వెంకటేశ్వరరావు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి, ఎలక్ట్రికల్ ఈఈ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ కె.రవీంద్ర, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో 16.4 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 16.4 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 2.6 మి.మీ. పడింది. సగటున 6.9 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తెనాలి మండలంలో 10 మి.మీ., కొల్లిపర 9.2, తుళ్లూరు 8.8, చేబ్రోలు 8.2, ప్రత్తిపాడు 7.8, తాడేపల్లి 7.6, మంగళగిరి 7.4, తాడికొండ 6.4, పెదకాకాని 6.2, గుంటూరు తూర్పు 6, గుంటూరు పశ్చిమ 5.6, పెదనందిపాడు 5.6, వట్టిచెరుకూరు 5, ఫిరంగిపురం 4.4, కాకుమాను 4, మేడికొండూరు మండలంలో 3.2 మి.మీ. చొప్పున వర్షం పడింది.

డెప్యూటీ తహసీల్దార్లు బదిలీ

నరసరావుపేట: జిల్లాలో పలువురు డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టి.కొండారెడ్డిని నకరికల్లుకు, అరుణదేవిని బెల్లంకొండకు, షేక్ సాల్మన్‌ను నాదెండ్లకు, ఎస్.శ్యామలతను పెదకూరపాడుకు, కె.శ్రీనివాసరావును నరసరావుపేటకు, బి.సుబ్బారావును శావల్యాపురానికికు, పి.తులసీరామ్‌ను నూజెండ్లకు, జి.వెంకటరమణను రెంటచింతలకు, పి.బ్రహ్మయ్యను దాచేపల్లికి, కె.రాజశేఖర్ నాయక్‌ను వెల్దుర్తికి, పి.వెంకటరెడ్డిని రొంపిచర్లకు, కె.బాలవెంకటేష్‌ను ముప్పాళ్లకు, ఎస్.అనూరాధను యడ్లపాడుకు, షేక్ బాషాను మాచర్లకు, ఎం.రాజాను అమరావతికి, సీహెచ్.లక్ష్మీప్రసాద్‌ను సత్తెనపల్లికి, పి.నరసయ్యను బొల్లాపల్లికి, ఐ.ఫణీంద్రను గురజాల ఆర్డీవో కార్యాలయానికి, జి.విద్యాసాగర్‌ను కారంపూడికి బదిలీ చేశారు.

రైతన్నలూ.. నకిలీలతో పారాహుషార్ !

పత్తి, మిర్చి విత్తనాలు కొనేముందు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రత్తిపాడు: కొద్ది రోజుల్లో ఖరీఫ్ ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో విత్తనాల కొనుగోలు సమయంలో రైతులంతా ఈ జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.

- వ్యవసాయశాఖ ద్వారా లైసెన్సు పొందిన డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.
- కొనే సమయంలో వ్యాపారి నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- జిన్నింగ్ లేదా లూజుగా ఉన్న పత్తి విత్తనాలు, కంపెనీ పేరు లేని ప్యాకెట్లు కొనకూడదు.
- పగిలిన ప్యాకెట్లు, గడువు దాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దు.
- బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు నంబరు, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, విత్తన రకం పేరు, బ్యాచ్ నంబరు, గడువు తేదీ, నికర తూకం, నికర ధరతో పాటు కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి. పై వివరాలన్నీ ఉంటేనే రైతులు బిల్లును తీసుకోవాలి.



పత్తి విత్తనాలు

- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సంచులపై కంపెనీ సీలు ఉన్నదో లేదో గమనించుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చిన బిల్లును పంట కాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలి.
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లును మాత్రం కచ్చితంగా అడిగి తీసుకోవాలి.
- విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని పరిశీలించాలి.
- సంతృప్తిగా ఉన్న విత్తన రకాలనే వాడాలి. తద్వారా మంచి ఫలితాలు వచ్చే వీలుంటుంది.

గతంలో ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు

2019కు ముందు వరకు నకిలీల బెడద రైతులను తీవ్రంగా వెంటాడేది. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నకిలీల బారిన పడకుండా రైతాంగాన్ని కాపాడేందుకు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వమే వాటి ద్వారా భరోసా, గ్యారెంటీ ఇస్తూ నాణ్యమైన, రాజీలేని ఉత్పత్తులను అందించింది. దీంతో రైతులు ఆయా కేంద్రాల ద్వారానే పత్తి, మిర్చి విత్తనాలను కొనుగోలు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత రైతుభరోసా కేంద్రాల పేరును మార్చి రైతు సేవ కేంద్రాలుగా నిర్వహిస్తున్నప్పటికీ అందులో సేవలు మాత్రం శూన్యమనే చెప్పాలి.

లైసెన్సు ఉన్న వారి నుంచే కొనాలి



విత్తనాలను కచ్చితంగా లైసెన్సు ఉన్న అధీకృత డీలరు వద్దే కొనుగోలు చేయాలి. ఈ సమయంలో బిల్లు తప్పనిసరిగా తీసుకుని డీలరుతో సంతకం చేయించుకోవాలి. రైతు కూడా బిల్లుపై సంతకం చేయాలి. పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లుతో పాటు విత్తనాల ప్యాకెట్ కవరును భద్రపరుచుకోవాలి. రైతులు నకిలీల బారిన పడకుండా అవగాహన కల్పిస్తాం. దుకాణాల్లోనూ విస్తృత తనిఖీలు చేపడతాం.

– షేక్ సుగుణా బేగం (ఏవో, ప్రత్తిపాడు)

వైఎస్సార్ సీపీలో పదవులు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పఠాన్ సైదా ఖాన్‌ను పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సురసాని వెంకటరెడ్డిని పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఒక్కసారి స్టేషన్‌కు రండి !

- సింగయ్య మృతి కేసులో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు పోలీసులనుంచి ఫోన్లు
- ఘటనాస్థలిలో ఫోన్లు ఆపరేట్ చేస్తున్న వారిని గుర్తించి లిఖిత పూర్వక స్టేట్‌మెంట్లు
- ఆందోళనకు గురవుతున్న పార్టీ అభిమానులు, వారి కుటుంబ సభ్యులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఒక్కసారి స్టేషన్‌కు రండీ ! అంటూ వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు పోలీసుల నుంచి ఫోన్లు వస్తుండటంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా పర్యటనకు వెళుతున్న సమయంలో గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులోని హైవే సర్వీసు రోడ్డులో వాహనం కింద పడి వెంగళాయపాలేనికి చెందిన చీలి సింగయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. తొలుత ఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రాథమికంగా విచారించి, వీడియోలు, ఫొటోలను పోలీసులు సేకరించారు. అనంతరం వీడియోలో ఉన్న వ్యక్తులను గుర్తించడం, వారిలో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను మొబైల్ ఫోన్లలో చిత్రీకరిస్తున్న వ్యక్తులు, కాన్వాయ్‌కు సమీపంగా ఉన్నవారని గుర్తించారు. ఒక్కసారి స్టేషన్‌కు రావాలంటూ రెండు రోజులుగా నల్లపాడు పోలీసులతో పాటు స్థానిక పోలీసులు ఫోన్లు చేస్తుండటం వారిలో ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే చినకోండ్రుపాడు, ప్రత్తిపాడు, తుమ్మలపాలెం, పెదగొట్టిపాడు, వట్టిచెరుకూరు మండలాలకు చెందిన కొందరిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. వారిలో కొందరి నుంచి లిఖితపూర్వక స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో వీడియోలు తీశారా? సింగయ్య మృతి చెందడం చూశారా? మీతో పాటు ఎవ్వరెవ్వరు వచ్చారు? తదితర వివరాలపై ఆరా తీస్తున్నారు. అంతేకాకుండా కొందరి నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుంటూ వీడియో కూడా చిత్రీకరిస్తున్నట్లు సమాచారం.

ఫోన్లు స్వాధీనం

స్టేట్‌మెంట్లు తీసుకున్న తరువాత పోలీసులు సదరు వ్యక్తుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల తరువాత అందులోని వీడియోలు, ఫొటోలను పరిశీలించి అనంతరం తిరిగి ఇచ్చేస్తామని సంబంధిత వ్యక్తులకు పోలీసులు చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక ఫోన్లు వారికి ఇచ్చేసి సిమ్స్ తీసుకుని తిరిగి వచ్చేస్తున్నారు.






తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన జిల్లా నేతలు అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, బలసాని కిరణ్‌కుమార్, కాసు మహేష్‌రెడ్డి, విడదల రజిని, నూరి ఫాతిమా, అంబటి మురళీకృష్ణ, ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, పోతిన మహేష్, వేమారెడ్డి తదితరులు

సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాట

కలెక్టర్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏల నిరసన

లక్ష్మీపురం: ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం వీఆర్‌ఏలు నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వో ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలన పేరుతో హామీలు అమలు చేశామంటూ పెద్దఎత్తున సభలు నిర్వహిస్తూ ఉత్సవాలు చేసుకుంటోందని విమర్శించారు. వాటిలో వీఆర్‌ఏలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని తెలిపారు. మంత్రి నారా లోకేష్ నాడు నిర్వహించిన యువగళం, పాదయాత్రలో అధికారంలోకి వస్తే తమ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకులతో సమావేశం జరిపి, సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇది నేటికీ అమలు కాలేదని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వీఆర్‌ఏలకు పే స్కేలు వేతనాలు ఇస్తోందని, ఇక్కడ ప్రభుత్వాలు ఆదిశగా ఎందుకు ఆలోచించట్లేదని ఆయన ప్రశ్నించారు. వీఆర్‌ఏలకు గతంలో డీఏను వేతనంతో కలిపి ఇచ్చేవాళ్లని, ప్రస్తుతం విడిగా ఇవ్వడంతో పెరుగుదల లేదని పేర్కొన్నారు. గత ఎనిమిది సంవత్సరాల నుంచి వేతనాలు పెంపు లేని కారణంగా వీఆర్‌ఏలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీఆర్‌ఏలుగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వారు ఉంటున్నారని, వారి సమస్యల ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఖాళీగా ఉన్న వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి పోరాటం చేస్తామని లక్ష్మణరావు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు బొక్క సాంబశివరావు, షేక్ కరీమున్నిసా, షేక్ ఆదం షఫీ, ఎన్. రామారావు, హనుమంతరావు, ప్రతాప్, పాండు, రాజేష్, రవి, వెంకయ్య పాల్గొన్నారు.



డీఆర్వో ఖాజావలికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘం నాయకులు

గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అజీజ్

పట్నంబజారు: చెడు వ్యసనాలకు బానిసలుగా మారి గంజాయి విక్రయిస్తున్న ఇద్దరని పాత గుంటూరు పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, పీఎస్ ఎస్‌హెచ్‌ఓ కె.వెంకటప్రసాద్, ఎస్‌ఐ షేక్ రెహమాన్ వెల్లడించారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన తోట గోపాలకృష్ణ ప్రస్తుతం పాత గుంటూరు యాదవ బజారులో, రామిరెడ్డితోటకు చెందిన నాగళ్ల ప్రవీణ్‌కుమార్ ప్రస్తుతం నెహ్రూనగర్ మోతీలాల్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చెడు స్నేహాల వల్ల గంజాయికి బానిసలై, ఖర్చులకు డబ్బులు సంపాదించేందుకు ఇక్కడకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రెండు నెలల కిందట ఒడిస్సా రాష్ట్రానికి వెళ్లి ఎలక్ట్రికల్ పనులు చేస్తూ గంజాయి కొనుగోలు చేసి, ఈనెల 20న గుంటూరు వచ్చారు. పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద ఇద్దరని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబర్చిన హెడ్‌కానిస్టేబుల్ షేక్ నూరుల్లా, కానిస్టేబుల్ జి.శ్రీనివాస్‌లను డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అభినందించారు.

రోబోటిక్ సర్జరీల్లో భారత్ పురోభివృద్ధి

సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి



రష్యన్‌లకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి

గుంటూరు మెడికల్: మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో రోబోటిక్, కృత్రిమ మేధస్సు (ఏఐ) పురోగతిని రష్యన్లకు పరిచయం చేయడం ఆనందంగా ఉందని సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. రష్యా రాజధాని మాస్కోలో నాలుగు రోజులు పాటు జరిగిన యూరో ఆసియన్ ఆర్థోపెడిక్ ఫోరం ప్రదర్శనలో పాల్గొని వచ్చిన ఆయన బుధవారం స్థానిక అరండల్‌పేటలోని సాయి భాస్కర్ హాస్పిటల్స్‌లో అక్కడి అనుభవాలను విలేకరులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థోపెడిక్ విభాగంలో వినియోగం పెంచాలని సూచిస్తూ పలు రోబోటిక్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. దానికి అనుగుణంగా రష్యాలో జరిగిన ఈ ప్రదర్శనలో భారత్‌లో ఆర్థోపెడిక్ రంగంలో రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగాన్ని, అనుసరిస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను రష్యన్ సర్జనులకు వివరించడం కొత్త అనుభూతిని మిగిల్చిందని పేర్కొన్నారు. జాయింట్ రీప్లేస్మెంట్‌లో రోబోటిక్ వాడకంపై రష్యన్ సర్జన్‌లు ప్రత్యేక ఆసక్తిని కనబరిచారని వివరించారు. రష్యాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నప్పటికీ సమావేశాలకు దాదాపుగా 500 మందికి పైగా ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు హాజరయ్యారని తెలిపారు. భారత్‌లో మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలలో రోబోటిక్ పాత్ర, అనుభవాలను అక్కడి వారికి వివరించినట్లు డాక్టర్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.

అవగాహనతోనే మాతృ మరణాలకు అడ్డుకట్ట

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

గుంటూరు మెడికల్: గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించడంతో మాతృ మరణాలు నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో మే నెలలో గుంటూరువారితోట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జరిగిన మాతృ మరణానికి గల కారణాలను కమిటీ సభ్యులు సమీక్షించారు. కూలంకషంగా చర్చించాక ఈ మరణం నివారించలేనిదిగా నిర్ణయించినట్లు డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు. భవిష్యత్తులో ఇటువంటి మరణాలు సంభవించకుండా ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షకులు, వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. మాతృ మరణాలకు గల కారణాలపై గర్భిణులు, బాలింతలతోపాటు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని చెప్పారు. గర్భిణులు కూడా క్రమం తప్పకుండా వైద్యాధికారి వద్ద ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ తదితర ఆరోగ్య సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పౌష్టికాహారం, వ్యాయామం, తగిన విశ్రాంతి తీసుకోవడం లాంటి చర్యలతో మాతృ మరణాలను పూర్తిగా నివారించవచ్చని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ రంగారావు, డాక్టర్ ఝాన్సీవాణి, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ ఆదిత్య ప్రదీప్ రెడ్డి, డాక్టర్ రాధికా రాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ ప్రియాంక, శ్రీధర్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


మాస్టర్ మైండ్స్ విద్యార్థులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న రిషబ్ ఓస్వాల్, కొత్తపేట తేజస్విని

గుంటూరు ఎడ్యుకేషన్: సీఎంఏ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకులను సాధించిన మాస్టర్ మైండ్స్ విద్యార్థులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్ష ఫలితాల్లో ప్రథమ ర్యాంకు సాధించిన ఆర్. రిషబ్ ఓస్వాల్, జూన్-2024లో జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్షలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్న కొత్తపేట తేజస్వినిని ఈనెల 23న న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి సత్కరించారని వివరించారు. వివిధ కామర్స్ కోర్సుల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు 55 సార్లు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారని, అయితే గతేడాది జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులను కైవసం చేసుకోవడం అరుదైన సంఘటనగా ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేసిన విద్యార్థులు, సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి మోహన్ అభినందనలు తెలియజేశారు.

న్యాయవాదుల విశిష్టతకు పుస్తక రూపం అభినందనీయం



పుస్తక పరిచయంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

తెనాలి: న్యాయవాదుల విశిష్టతను నేటి తరానికి తెలియజేయడం అభినందనీయమని పలువురు న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఇటీవల హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ఆవిష్కరించిన 'తెనాలి లాయర్స్ డైరీ-2025' పరిచయ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం తెనాలి కోర్టు ప్రాంగణంలోని మహిళా న్యాయవాదుల భవనంలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ అధ్యక్షత వహించారు. 11వ అదనపు జిల్లా జడ్జి డి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్, ఫస్ట్ ఏఎంఎం వివేక్‌వర్ధన్‌లు పాల్గొన్నారు. తెనాలి లాయర్స్ డైరీతో ఈ ప్రాంత న్యాయవాదుల ప్రాముఖ్యతను, సమాచారాన్ని పొందుపరచడం ఉపయోగకరమని జడ్జి ఎం.శ్రీధర్ అన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మందలపు వేణుగోపాల్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, నాయయవాదులు వెలినేని రాఘవయ్య, మద్ది మల్లికార్జునరావు, ఎం.జగదీశ్వరాంబ, ఎ.విజయలక్ష్మి, గుమ్మడి రవి రాజ్ మాట్లాడారు. తెనాలి లాయర్స్ డైరీ రూపకల్పన చేసిన గుంటూరు కృష్ణను సత్కరించారు.

పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 843


కొమ్ములు : 627 బస్తాలు	(ధర రూ॥ల్లో)	
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,200	10,160

కాయలు : 216 బస్తాలు		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,200	9,800

మొత్తం అమ్మకాలు : 632.250 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	52,329
అమ్మకాలు	53,598
నిల్వ	9,778

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,000
నంబరు-5	రూ. 10,000 - 13,300
273	రూ. 10,000 - 12,400
341	రూ. 10,000 - 13,300

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,600
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 - 12,800
ఆర్మూర్	రూ. 9,800 - 11,000
తాలుకాయలు	రూ. 5,000 - 6,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,000
నంబరు-5	రూ. 10,000 - 13,500
273	రూ. 10,000 - 12,800
341	రూ. 10,000 - 13,400

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,800
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
తాలుకాయలు	రూ. 5,000 - 76,000

-కొరిటిపాడు (గుంటూరు)